నమస్తే తెలంగాణ

ఖమ్మం

10 | ఖమ్మం, ఆదివారం 16 మార్చి 2025 | KHAMMAM

ప్రశ్నించే గొంతు నొక్కడం మీ వల్లకాదు..

- కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరంతర పోరు కొనసాగిస్తాం
- పాల్వంచలో నిరసన ర్యాలీలో మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 15 (నమస్తే తెలంగాణ) : ఇచ్చిన హామీలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుంటే గొంతునొక్కే ప్రయత్నం చేయడం అప్రజాస్వామికమని, ప్రశ్నించే వారిని పగబడితే ఊర్కునేది లేదని మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ పాల్వంచలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వనమా మాట్లాడుతూ కేటీఆర్, హరీశ్‌రావులు బీఆర్ఎస్ పార్టీకి రెండు బుల్లెట్ల లాంటి వారని, కేసీఆర్ నాయకత్వంలో కాంగ్రెస్ పై నిరంతరం పోరు కొనసాగిస్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో అహంకార పూరిత రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ చరిత్రలో గురువారం చీకటి రోజుగా మిగిలిపోయిందని, శాసనసభలో సభ్యుడి వివరణ తీసుకోకుండా సస్పెండ్ చేయడం దారుణమని అన్నారు. ఇందిరమ్మ రాజ్యం అంటే ఇదేనా? అని ప్రశ్నించారు. ఎమర్జెన్సీ పాలనను కాంగ్రెస్ మళ్లీ గుర్తు చేస్తుందన్నారు. నిరసన ర్యాలీలో బీఆర్ఎస్ నాయకుడు వనమా రాఘవేంద్రరావు, సీనియర్ నాయకుడు కిలారు నాగేశ్వరరావు, సొసైటీ ఉపాధ్యక్షుడు కాంపెల్లి కనకేష్, మంతపురి రాజుగౌడ్, పూసల విశ్వనాథం, మాజీ ఎంపీపీ బాదావత్ శాంతి, దాసరి గేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచలో మాజీ మంత్రి వనమా ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

చంద్రుగొండ జాతీయ రహదారిపై రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

చంద్రుగొండ, మార్చి 15 : అసెంబ్లీ సమావేశాల నుంచి ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై శనివారం దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ శాసనసభలో ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలు ఇస్తూ కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలను ప్రశ్నించడం ప్రతిపక్షాల హక్కు అని, అలాంటి హక్కులను సస్పెన్షన్లతో కాలరాయాలని చూడడం సరికాదన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు కర్రుకాల్చి వాత పెడతారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కొణకండ్ల వెంకటరెడ్డి, దారా బాబు, సంగొండి రాఘవులు, నరుకుళ్ల సత్యనారాయణ, సూర వెంకటేశ్వరరావు, భూపతి రమేశ్, మేడా మోహన్‌రావు, సత్తి నాగేశ్వరరావు, పాండ్ల అంజన్‌రావు, పత్తిపాక వెంకటేశ్వర్లు, సయ్యద్ గఫార్‌మియా, కళ్లెం వెంకటేశ్వర్లు, సయ్యద్ బాద్‌షా, శివ పాల్గొన్నారు.

లక్ష్మీదేవిపల్లిలో నిరసన

లక్ష్మీదేవిపల్లి ప్రధాన రహదారిపై నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

లక్ష్మీదేవిపల్లి, మార్చి 15 : ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌కు నిరసనగా బీఆర్ఎస్ నాయకుడు కొట్టి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై బీఆర్ఎస్ నాయకులు శనివారం నిరసన తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా ప్రజలను మభ్యపెట్టే రాజకీయాలు చేయడం సబబు కాదన్నారు. వెంటనే జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శేషాద్రి వినోద్, ఎక్బాల్, తుంపిరి ప్రసాద్, కోరం చంద్రశేఖర్, రజాక్, శ్రీకాంత్‌నాయక్, మెరుపు రమేశ్, ఎర్రబడి శ్రీను, చిన్న, గోనె సురేశ్, కోట రాంబాబు, రసూల్, తాండ్ర నాగబాబు, టీ టైప్ మునీర్, అజ్మీరా విజయ్‌కుమార్, తంబాల శ్రీనివాస్, శివ పాల్గొన్నారు.

మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని అసెంబ్లీ నుంచి సస్పెన్షన్ చేయడం పట్ల ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రెండో రోజు శనివారం నిరసనలు వెల్లువెత్తాయి. బీఆర్ఎస్ శ్రేణులు కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడుతూ నిరసన ర్యాలీలు, సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనాలు చేపట్టారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ, లక్ష్మీదేవిపల్లి, భద్రాచలం, చర్ల మండల కేంద్రాల్లో నిరసన ర్యాలీలు చేపట్టారు. చంద్రుగొండ జాతీయ రహదారిపై సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.

సస్పెన్షన్‌పై వెల్లువెత్తిన నిరసనలు

- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ర్యాలీలు, దిష్టిబొమ్మ దహనాలు
- జగదీశ్‌రెడ్డిపై సస్పెన్షన్ ఎత్తివేయాలని బీఆర్ఎస్ శ్రేణుల డిమాండ్

భద్రాచలంలో జగదీశ్‌రెడ్డిపై సస్పెన్షన్ ఎత్తివేయాలని నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

అంబేద్కర్ విగ్రహానికి వినతి

భద్రాచలం, మార్చి 15 : సూర్యాపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిపై సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భద్రాచలం పట్టణంలో నాయకులు శనివారం నిరసన తెలిపారు. అనంతరం అంబేద్కర్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఆకోజు సునీల్‌కుమార్ మాట్లాడుతూ శాసనసభ విధానాలకు అనుగుణంగా మాట్లాడే సీనియర్ నాయకుడు జగదీశ్‌రెడ్డి అని, ఆయనపై వెంటనే సస్పెన్షన్ ఎత్తివేయాలన్నారు. ప్రభుత్వ వైఫల్యాలు, విధానాలను ఎండగడుతూ ప్రజా సమస్యలపై గళమెత్తుతున్న జగదీశ్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు వేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో మండల కోకన్వీనర్ రేపాక పూర్ణచందర్‌రావు, నాయకులు అయినాల రామకృష్ణ, కాపుల సూరిబాబు, తూతిక ప్రకాశ్, అంబటికర్ర కృష్ణ, నానిపల్లి శ్రీను, బాసిపోయిన మోహన్‌రావు, రావూరి రవికిరణ్, బద్ది బాబి, ఇమంది నాగేశ్వరరావు, మురాల డానియేల్, ప్రదీప్, మహిళా నాయకులు కావూరి సీతామహాలక్ష్మి, పూజల లక్ష్మి, తెల్లం రాణి, గంపల రవికుమారి, ప్రవంతి తదితరులు పాల్గొన్నారు.

సాగునీటికి కష్టం

సర్కారు నిర్లక్ష్యం..

- చంద్రుగొండ మండలం సీతాయిగూడెంలో ఎండిన వెంగళ రావు ప్రాజెక్టు
- తెగిన అలుగుకు కాంగ్రెస్ సర్కారు కనీస మరమ్మతులు చేయని ఫలితం
- పదేళ్ల తరువాత మళ్లీ ఆయిల్ ఇంజిన్లను వాడుతున్న అన్నదాతలు
- ఎండుతున్న పంటలను కాపాడుకునేందుకు కర్షకుల భగీరథ యత్నాలు
- 1,300 ఎకరాల ఆయకట్టులో 300 ఎకరాలకే పరిమితమైన యాసంగి

ఎండిన వెంగళరావు ప్రాజెక్టు

చంద్రుగొండ, మార్చి 15 : చంద్రుగొండ మండల రైతులకు సాగునీటి కష్టాలు మొదలయ్యాయి. పదేళ్ల తరువాత మళ్లీ ఆయిల్ ఇంజిన్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి దాపురించింది. ఎండుతున్న పంటలను కాపాడుకునేందుకు కర్షకులు భగీరథ యత్నాలు చేయాల్సి వస్తోంది. ఇదివరకే తెగిన అలుగుకు కాంగ్రెస్ సర్కారు మరమ్మతులు చేయని ఫలితం.. అన్నదాతలకు శాపంగా మారింది. రూ.వేలకు వేలు వెచ్చించి లీటర్లకు లీటర్లు ఆయిల్‌ను కొనుగోలు చేసి తీసుకొచ్చి ఇంజిన్లు నడిపించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కిలోమీటర్ల మేర పైపులు ఏర్పాటు చేసుకొని పంటలకు నీటిని సరఫరా చేసుకోవాల్సిన దయనీయ దుస్థితి వచ్చింది.

భద్రాద్రి జిల్లా చంద్రుగొండ మండలం సీతాయిగూడెంలోని వెంగళరావు ప్రాజెక్టు ఈ వేసవిలో ఎండిపోయింది. దీంతో దీని ఆయకట్టు పరిధిలో రైతులకు సాగునీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. తెగిపోయిన ప్రాజెక్టు అలుగుకు మరమ్మతులు చేయించి కర్షకులకు సాగునీళ్లు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కనీస చర్యలు కూడా తీసుకోలేదు. ఈ కారణంగా ఆయకట్టు రైతులు ఈ యాసంగిలో సాగు చేయాల్సిన సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. ఆయకట్టు కింద ఈ యాసంగిలో మొత్తం 1,300 ఎకరాల్లో పంటలు సాగు కావాల్సి ఉండగా.. కేవలం 300 ఎకరాల్లోనే రైతులు వరి పంటను సాగుచేస్తున్నారు. ఇంత గణనీయంగా సాగు విస్తీర్ణం తగ్గిపోవడమే సాగునీటి కొరత సమస్యలను తెలియజేస్తోంది.



ఎండిన వెంగళరావు ప్రాజెక్టులో సాగునీటి కోసం రైతు ఏర్పాటు చేసుకొన్న ఆయిల్ ఇంజిన్

ఎండిన వెంగళరావు ప్రాజెక్ట ఎడమ పంట కాలువ

తెగిన అలుగుకు ప్రభుత్వం మరమ్మతులు చేయకపోవడంతో ఆయకట్టు రైతులు కూడా పంటల విస్తీర్ణాన్ని తగ్గించారు. ప్రాజెక్టులో వినియోగించుకునేందుకు అవకాశం ఉన్న మేరకే వరి పంటను వేశారు. కానీ గత నెల రోజుల నుంచి తూము వరకు కూడా నీళ్లు రాలేదు. పైగా ఎడమ కాలువ ఎండిపోయింది. దీంతో రైతులకు పెద్ద కష్టమే వచ్చి పడింది. దీంతో పంటలను కాపాడుకునేందుకు వారు చేయని ప్రయత్నం లేదు. గడిచిన పదేళ్లుగా దూరం పెట్టిన ఆయిల్ ఇంజిన్లను మళ్లీ తెచ్చుకోవాల్సిన తప్పనిసరి పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో సాగునీరు అలస్యమైన కారణంగా ఇప్పటికే 50 ఎకరాల మేర వరి పైరు ఎండిపోయింది. ఆ పంటను చూసి రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. మిగిలిన పంటలనైనా కాపాడుకోవాలన్న లక్ష్యంతో ఇప్పటికే ఎకరానికి రూ.35 వేల వరకు అప్పులుచేసి మరీ పెట్టుబడులు పెట్టారు. అయినప్పటికీ మరోవైపు పంటలు ఎండిపోతూనే వస్తున్నాయి. కొన్నిచోట్ల చేతికొచ్చే సమయంలో పంట ఎండిపోతుండడంతో రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. గత కేసీఆర్ పాలనలో గడిచిన పదేళ్లుగా పుష్కలంగా నీళ్లు పారిన కాలువలు నేడు నెర్రెలు వారి కన్నిస్తుండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఎండిపోయిన ప్రాజెక్టును, కాలువలను, పంట పొలాలను చూసి తల్లడిల్లిపోతున్నారు.

ఆయిల్ ఇంజిన్‌ను భుజాలపై మోసుకొచ్చా..

ఆయకట్టులోని ఎండిన పంట పొలాలు

నేను కూడా మూడు ఎకరాల వరి పంట సాగు చేస్తున్నాను. ప్రాజెక్టు నుంచి నీళ్లు అందక పంట ఎండిపోతోంది. మాగాణి నెర్రెలు వారుతోంది. చూస్తే బాధ వేసింది. అందుకే పంటను కాపాడుకునేందుకు నీళ్ల కట్టాలను కున్నా. ప్రాజెక్టులో నీరు ఉన్న చోటు వరకూ ఆయిల్ ఇంజిన్‌ను భుజాలపై మోసుకుంటూ వెళ్లాను. రూ.వేలకు వేలు ఖర్చు చేసి లీటర్లకు లీటర్లు ఆయిల్ పోసి ఇంజిన్లను నడుపుతున్నా. ఖర్చులు ఇంతలా పెరిగినా పెట్టుబడులు కూడా వచ్చేలా లేవు.

-చింతల భద్రయ్య, రైతు, దామరచర్ల, చంద్రుగొండ

నేను నాలుగు ఎకరాల్లో వరి సాగు చేస్తున్నాను. అప్పులు తెచ్చి మరీ పెట్టుబడి పెట్టాను. కానీ నీళ్లు అందక ఇప్పుడు పంటలు ఎండిపోతున్నాయి. అలుగు తెగిన కారణంగా వెంగళరావు ప్రాజెక్టులో ఈ వేసవిలో నీళ్లు లేవు. అడుగున ఉన్న నీటిని వినియోగించుకొని కొంత మేరకు

ఆయిల్ ఇంజిన్‌తో నీళ్లు పెడుతున్నాం..

పంటలను కాపాడుకోవాలనుకున్నాం. నేనైతే రోజుకు ఐదు లీటర్ల ఆయిల్ తెచ్చి ఇంజిన్లో పోసి నడిపించుకుంటున్నా. ఎండిపోతున్న పంటలను కాపాడుకునేందుకు ఇంతకుమించిన మార్గం లేదు.

-బొమ్మకంటి చెన్నారావు, ఆయకట్టు రైతు, దామరచర్ల, చంద్రుగొండ

ఓటర్ల జాబితా పరిశీలన : కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 15 (నమస్తే తెలంగాణ) : ఓటరు జాబితాలో వచ్చిన అభ్యంతరాలను పరిశీలించాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ బీఎల్‌వోలను ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కలెక్టర్ శనివారం ఐడీవోసీలో రాజకీయ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ, ఓటరు జాబితా రూపకల్పన, ఫారాలు 6, 7 గురించి వివరించారు. పార్టీల నాయకులు బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకోవాలన్నారు. వారి జాబితాను పార్టీ జిల్లా ఇంచార్జిలు ధ్రువీకరణ చేసి ఇవ్వాలన్నారు. నూతన ఓటరు జాబితా, చేర్పులు, మార్పులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. తొలగింపు జాబితాను కూడా రూపొందిస్తున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఫారం 6, 7, 8లలో 19,514 దరఖాస్తులు రాగా.. వాటిలో 10,944 దరఖాస్తులను పరిష్కరించినట్లు పేర్కొన్నారు. 18 ఏళ్ల నిండిన ప్రతీ ఓటరు ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. సమావేశంలో ఎన్నికల సూపరింటెండెంట్ ప్రసాద్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్ సరికాదు..

చర్ల మండల కేంద్రంలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ శ్రేణులు

చర్ల, మార్చి 15 : ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపితే కాంగ్రెస్ పాలకులు ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేశారని, ఇది సరైన విధానం కాదని బీఆర్ఎస్ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు అన్నారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండల కేంద్రంలో శనివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఉప కన్వీనర్ అయినవోలు పవన్‌కుమార్, సీనియర్ నాయకులు ఎస్‌డీ అజీజ్, పంజా రాజు, కాకి అనిల్, మాజీ ఎంపీపీ గీద కోదండరామయ్య, ఎడ్ల రాందాసు, బుల్లబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

అణగారిన కులాల అభ్యున్నతే లక్ష్యం

- స్వేరోయిజం కాంతివేగంతో సాగాలి
- నేలకొండపల్లిలో స్వేరో దీక్షల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

నేలకొండపల్లిలోని బౌద్ధ స్తూపం వద్ద స్వేరో దీక్షలో పాల్గొని అభివాదం చేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, స్వేరో నాయకులు

కూసుమంచి(నేలకొండపల్లి), మార్చి 15 : అణగారిన కులాల అభ్యున్నతే లక్ష్యంగా స్వేరోస్ పని చేస్తుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఐపీఎస్ అధికారి, స్వేరో వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. నేలకొండపల్లి మండల కేంద్రంలోని బౌద్ధ స్తూపం వద్ద స్వేరో ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలకు శనివారం ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ స్వేరోయిజం అనేది కాంతి వేగంతో సాగాలని, ఇది నెల రోజులకే పరిమితం కాకుండా నిరంతరం స్వేరోయిజం జరుగుతూ ఉండాలన్నారు. 2013లో భీమ్ దీక్ష ప్రారంభమైందని, కాన్షీరాం జయంతి రోజు మొదలై అంబేద్కర్ జయంతి రోజున దీక్షలు ముగుస్తాయన్నారు. ప్రతీ ఇంట్లో పుస్తకాలు ఉండాలని, ప్రతీ రోజు పుస్తక పఠనం చేయాలని, తద్వారా పిల్లలకు జ్ఞానం అందుతుందన్నారు. ప్రపంచంలోని గొప్ప వ్యక్తులందరూ పుస్తక పఠనంతోనే వెలుగులోకి వచ్చారని ఆయన గుర్తు చేశారు. దళిత కుటుంబాల్లో నేటికి వెనుకబాటుతనం కనిపిస్తుందని, వారంతా కుంగిపోకుండా అన్ని రంగాల్లో రాణించినప్పుడే మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. భీం ఒక్క తెలంగాణ రాష్ట్రం లోనే కాకుండా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో స్వేరోలు గ్రామాల్లో తిరుగుతూ అజ్ఞానం అనే సంకెళ్లను తెంచి వేశారని గుర్తు చేశారు. గంజాయి, మాదక ద్రవ్యాలు, మద్యపానం, ధూమపానం వంటి వాటికి దూరంగా ఉంటే అనేక సమస్యలు తీరడంతోపాటు ఆరోగ్యం బాగుంటుందన్నారు. రాష్ట్ర స్వేరో అధ్యక్షుడు చిలకబత్తిని వీరయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవరగట్టు బాలప్రసాద్, జిల్లా అధ్యక్షుడు మొండితోక ఈదయ్య, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, కిషన్, పుల్లయ్య, లలిత, శోభ, ప్రకాశ్, నియోజకర్గ మండల బాధ్యులు పాల్గొన్నారు.